క్లుప్తంగా

ఉపకార వేతనానికి ఎంపిక


పూజశ్రీ

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురం జెడ్పీ హైస్కూలులో 8వ తరగతి చదువుతున్న కె.పూజశ్రీ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైంది. ఈ విద్యార్థినికి ఏటా రూ.12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు ఇంటర్ పూర్తయ్యే వరకు ఉపకార వేతనం అందుతుంది. పూజశ్రీని హెచ్‌ఎం సుబ్బరాయన్, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు మెగా జాబ్ మేళా

పెనుమూరు (చిత్తూరు అగ్రికల్చర్): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, మహాసముద్రం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం జగనన్న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మహాసముద్రం ఫౌండేషన్ అధ్యక్షుడు దయాసాగర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళా మండలంలోని పులిగుండు వద్ద ఉదయం 9 గంటలకు ఆరంభమవుతుందని తెలియజేశారు. ఇతర వివరాల కోసం 9949335990, 9959995801 ను సంప్రదించాలని కోరారు.

బాలలతో పనులు చేయిస్తే కేసు


దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న సహాయ కార్మిక అధికారి

నింద్ర : బాలలను పనుల్లో పెట్టుకుంటే కేసులు ఎదుర్కోవాల్సి వస్తుందని పుత్తూరు సహాయ కార్మి క అధికారి హేమాచారి హెచ్చరించారు. సోమవా రం నింద్రలో దుకాణాలను తనిఖీ చేశారు. ఎవరైనా బాలలతో పనులు చేయిస్తున్నారా? అని ఆరా తీశారు. ఆపై దుకాణదారులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్ల లోపు వారిని పనుల్లో పెట్టుకోరాదని, అలా చేస్తే కేసు, జరిమానా తప్పదన్నారు. కార్యక్రమంలో నింద్ర ఎస్‌ఐ శివశంకర్, ఏఎస్‌ఐ ఏలుమలై, సోషల్ వర్కర్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఉపకార వేతనానికి ముగ్గురు ఎంపిక

శ్రీరంగరాజపురం: జాతీయ ఉపకార వేతనానికి 49 కొత్తపల్లిమిట్ట జెడ్పీ హెచ్‌ఎస్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం లలితకుమారి తెలిపారు. కేంద్ర మానవ వనరుల శాఖవారు ఫిబ్రవరిలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో 8వ తరగతికి చెందిన నవ్యశ్రీ, హరిశంకర్, జరీన్నిక ఎంపికయ్యారన్నారు. వీరికి రూ.12,500 చొప్పున నాలుగేళ్లపాటు చెల్లిస్తుందని తెలియజేశారు.

గడప వద్దకే వైద్య సేవలు


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు


శ్రీరంగరాజపురం: ఫ్యామిలీ ఫిజిషియన్ విధనంలో గడప వద్దకే వైద్యసేవలు అందిస్తున్నట్లు డాక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి అన్నారు. మండలంలోని చిన్నతయ్యూరు సచివాలయంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 66 మందికి వైద్యసేవలు అందించారు. ఆరోగ్యశ్రీ కింద వైద్యం పొందిన వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రల్లో గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వరదమ్మ, పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, ఆరోగ్య సిబ్బంది, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాలను సద్వినియోగం చేసుకోండి


విత్తన కాయలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్యామల, శివప్రకాష్ రాజు

పాలసముద్రం: ప్రభుత్వం రైతులకు పంపిణీ చేస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్యామల, వ్యవసాయ సలహామండలి సభ్యుడు ఎస్ శివప్రకాష్ తెలిపారు. క్రిష్ణజమ్మాపురం, వనదుర్గాపురం రైతు భరోసా కేంద్రంలో సోమవారం వ్యవసాయాధికారి డిల్లీప్రసాద్ సమక్షంలో విత్తన కాయలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భానుప్రియతోపాటు వలంటీర్లు పాల్గొన్నారు

రంజింపజేసిన అర్జున తపస్సు



చిత్తూరు రూరల్: మహాభారత ఉత్సవాల్లో భాగంగా నగర పరిధిలోని బండపల్లిలో సోమవారం నిర్వహించిన అర్జున తపస్సు రంజింపజేసింది. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివార్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు.

అన్నదాతకు ఆర్బీకేలతో అండ

- ఆర్బీకేలతో ఇంటి ముంగిటకే సేవలు
- రాయితీతో ట్రాక్టర్లు, విత్తనాలు, ఎరువులు
- ఈ–క్రాప్ బుకింగ్‌తో పంటనష్ట పరిహారం
- వ్యయప్రయాసాలు తప్పాయంటున్న రైతన్నలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతే రాజుగా బతుకుతున్నాడు. గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయం దండగ అని రైతాంగానికి అన్ని విధాలా మొండిచేయి చూపింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే రైతాంగ సంక్షేమానికి పెద్దపీట వేసి అన్నదాతకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతుల కష్టాలకు తెరదించింది. వారి ముంగిటకే విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు మొదలుకుని పలు సేవలు అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయాన్ని పండుగ చేసింది.



రామకృష్ణాపురం ఆర్బీకే, సబ్సిడీతో యంత్రాలు పొందిన గోపాలకృష్ణాపురం రైతు సంఘ సభ్యులు (ఫైల్)

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలంలో మొత్తం 10 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ప్రతి కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సేవలందిస్తున్నారు. రాయితీపై ఎరువులు, పురుగుమందులు, పచ్చిరొట్ట విత్తనాలు, సాగుకు అవసరమైన యంత్రాలు, రోటావేటర్లు, కల్టివేటర్లు, ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, గడ్డి కట్టే యంత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఈ–క్రాప్ బుకింగ్, పంటల నష్ట పరిహారం వంటి సేవలు అందిస్తున్నారు. గ్రామాల్లో కియోస్క్ యంత్రం ద్వారా ఆన్‌లైన్‌లో రైతుల వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ యంత్రం ద్వారా రైతులు తమకు కావలసిన వ్యవసాయ పరికరాల వివరాలను నమోదు చేసుకుంటే వారంలోపే ఇంటి వద్దకే చేరుతున్నాయి. దీంతో తమకు రవాణ ఖర్చులు సైతం మిగులుతున్నాయని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనలో జన్మభూమి కమిటీల పేరిట దోపిడీకి అంతులేకుండా పోయింది. వైఎస్సార్ సీపీ పాలనలో వలంటీర్ల వ్యవస్థ పార్టీలకు, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తోంది.

ఆర్బీకేలతో అందించిన సేవలు

- మొత్తం రైతులు : 4,613
- రైతు భరోసా 5వ విడతలో తొలి విడత లబ్ధి : రూ. 3.46 కోట్లు
- కౌలు రైతుల సంఖ్య : 6

పంపిణీ చేసినవి

- యూరియా : 56.25 మెట్రిక్ టన్నులు
- డీఏపీ : 15.50 మెట్రిక్ టన్నులు
- జనుము : 10 క్వింటాళ్లు
- యంత్ర సేవా పథకం కింద : ట్రాక్టర్ 1, మినీ ట్రాక్టర్ 1, రొటోవేటర్లు 22

ట్రాక్టర్ కల నెరవేరింది



మా కస్టమ్ హైరింగ్ సెంటర్ (సీహెచ్‌సీ) గ్రూప్‌లో ఐదుగురు సభ్యులు ఉన్నాం. మేమంతా పేద రైతులం కావడంతో ట్రాక్టర్ కొనలేకపోయాం. అయితే వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద మినీ ట్రాక్టర్‌ను ప్రభుత్వం మాకిచ్చింది. ట్రాక్టర్ విలువ రూ.6 లక్షలు కాగా, కేవలం 10 శాతం రూ.60 వేలు కట్టి ట్రాక్టర్‌ను అందుకొన్నాం. దీంతో మా కల నెరవేరింది. 40 శాతం సబ్సిడీ కింద రూ.2.40 లక్షలు పోను మిగిలిన 50 శాతం రుణాన్ని కంతుల వారీగా చెల్లిస్తున్నాం. రూ.2.50 లక్షల విలువ చేసే రెండు రొటోవేటర్లు సైతం రూ.లక్ష సబ్సిడీతో అందుకొన్నాం. నా జీవితంలో ఇంత మంచి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు.
–జె.మురళి, పోలాక్షమ్మ రైతు గ్రూపు, రామకృష్ణాపురం ఆర్బీకే

జగనన్నకు రుణపడి ఉంటా



నాకు సెంటు భూమి లేదు. అయినా మరో రైతు నుంచి 8 ఎకరాలు కౌలు చేస్తున్నాను. జగనన్న ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.13,500 పెట్టుసాయం చేసింది. పంటసాగుదారు హక్కు పత్రాన్ని అందుకున్నాను. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ఇచ్చారు. ఉచిత పంట బీమా చేసుకున్నా. రైతుల్నే కాకుండా మాలాంటి కౌలు రైతులను కూడా ఆదుకొంటున్న జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.
–ఏ.ఉమాపతి, కౌలు రైతు, వేపగుంట

రైతు సేవలో తరిస్తున్నా!



రైతాంగానికి సేవ చేసే అవకాశం మాకు ఇప్పటి ప్రభుత్వం కల్పించింది. నా వేపగుంట ఆర్బీకేలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు డిజిటల్ కియోస్క్ యంత్రం ద్వారా రైతులకు కావల్సిన పురుగు మందులు, విత్తనాలు బుక్ చేసి అందుబాటులో ఉంచా. వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద 4 రొటావేటర్లను 40 శాతం సబ్సిడీతో ఇచ్చాం. 50 మంది రైతు పొలాల మట్టి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం పంపాను. వేరుశనగ 70 క్వింటాళ్లు, 100 కేజీల నువ్వుల కిట్లు, 6.5 టన్నుల ఎరువులు, 15 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశా. ప్రతివారం పొలంబడి కార్యక్రమం నిర్వహించి రైతులకు సలహాలు–సూచనలు ఇస్తున్నా.
–ఎస్. సెల్వం, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్, వేపగుంట ఆర్బీకే

విద్యాకానుక పంపిణీ

పుత్తూరు రూరల్: పాఠశాలలు ప్రారంభ రోజునే పండుగ వాతావరణంలో జగనన్న విద్యా కానుక పంపిణీకి సర్వం సిద్ధం చేస్తున్నామని ఎంపీపీ మునివేలు చెప్పారు. సోమవారం పాఠశాలలకు విద్యాకానుక కిట్ల పంపిణీని లాంఛనంగా ఆమె ప్రారంభించి మాట్లాడారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యా కానుక స్టాక్ పాయింట్ వద్దకు ప్రతి పాఠశాల హెచ్‌ఎం వచ్చి కిట్లను తీసుకెళ్లాలని తెలిపారు. మండలంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు గల 6,357 మంది విద్యార్థులకు యూనిఫామ్స్, బెల్ట్స్, షూస్, బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు. 6 నుంచి 10 వరకు 38,324 నోట్ బుక్స్, 49,393 టెక్ట్స్ బుక్స్, 451 డిక్షనరీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుమలరాజు, డీటీ స్వరూపారాణి, సీఆర్‌సీ జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.


పాఠ్య పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంపీపీ మునివేలు

రెవెన్యూ స్పందనకు 15 అర్జీలు

శ్రీరంగరాజపురం: స్పందన అర్జీలను పరిశీలించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై అధికాలను ఆదేశించారు. ఆయనకు సోమవారం 15 ఫిర్యాదులు వచ్చాయి. అందులో 7 మ్యుటేషన్, 6 భూతగాదాలు, 2 దారి సౌకర్యం కల్పించాలని అర్జీలు అందాయి. వీటిని సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని వీఆర్వో, సర్వేయర్లను ఆదేశించారు.

కమనీయం ద్రౌపదీ కల్యాణం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న దంపతులు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో జరుగుతున్న మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి నాగరత్న హరికథ కాలక్షేపం సాగింది. సాయంత్రం ఆలయం ఆవరణలో పెళ్లిపందిరి ఏర్పాటు చేసి ఉత్సవమూర్తులను వేంచేపు చేశారు. పట్టుపీతాంబరాలు, సుగంధపరిమళాలతో ముస్తాబు చేశారు. మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా మాంగల్యధారణ చేశారు. చుటు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కన్నికలమ్మకు ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని వెంగళరాజుకుప్పం కోన చెరువు సమీపంలో వెలసిన కన్నికలమ్మకు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దేవాలయం ఎదుట వివిధ యాగశాలలో హోమ పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ఊంజల్ సేవ చేశారు. అమ్మవారి పూజకు ఎంపీపీ శ్యామల, శివప్రకాష్ రాజు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు స్వామిరాజు పాల్గొన్నారు.

సెంచరీలతో మెరిసిన క్రీడాకారులు




ఆట ప్రారంభంలో అండర్ 14 క్రీడాకారులు, సెంచరీలు సాధించిన సిద్ధు, నరేంద్ర

నగరి: స్థానిక కేవీకే మైదానంలో కొన్ని రోజులుగా పలు క్రీడల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, వారికి నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఆసక్తికరంగా జరుగుతోంది. అండర్ 14, అండర్ 16 క్రీడాకారులకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సోమవారం శాప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. అండర్ 14 విభాగంలో కృష్ణా జట్టుపై ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో గోదావరి జట్టు ఒక్క పరుగు తేడా విజయం సాధించింది.తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి జట్టు 30 ఓవర్లలో 171 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ దిగిన కృష్ణా జట్టు 30 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 170 పరుగులు చేసి ఓటమి పాలైంది. అండర్ 16 విభాగంలో గంగా, యమున జట్ల మధ్య పోటీలో గంగ జట్టు వికెట్టు నష్టపోకుండా విజయం సాధించింది. 30 ఓవర్ల మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన యమునా జట్టు 8 వికెట్లను కోల్పోయి 251 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన గంగా జట్టు ఓపెనర్లు సిద్దు 120, నరేంద్ర 101 పరుగులతో ఇద్దరూ సెంచరీలు కొట్టి నాటౌట్‌గా నిలవడంతో 28.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. సెంచరీలు కొట్టిన క్రీడాకారులను వైఎస్సార్ సీపీ నాయకుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అభినందించారు. శాప్‌కోచ్ బాబు పాల్గొన్నారు.

మల్లారెడ్డికండ్రిగలో వైద్య శిబిరం


మల్లారెడ్డికండ్రిగలో వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ సోమశేఖర్

విజయపురం (నగరి): మండలంలోని మల్లారెడ్డికండ్రిగలో సోమవారం మరి కొంత మంది రక్త నమూనాలు సేకరించారు. మూడవ రోజు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సోమశేఖర్ వైద్య శిబిరం నిర్వహించి వైద్య పరీక్షలు చేశారు. ప్రస్తుతం గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని, కొత్త కేసులు ఏవీ నమోదు కాలేదన్నారు. అయినా 10 మంది రక్త నమూనాలు సేకరించి రూయ ఆసుపత్రికి పంపినట్లు ఆయన తెలిపారు.

కోవిడ్ సమయంలో ఎక్కడున్నావ్ భానూ?

మల్లారెడ్డికండ్రిగలో జ్వరాలు ప్రబలిన రోజు నుంచి ఇప్పటి వరకు మంత్రి ఆర్కే రోజా ఆదేశం మేరకు స్థానిక డాక్టర్లు వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య అందిస్తున్నారు. ఇంటింటా జ్వరాల సర్వే చేస్తున్నారు. బాధితులకు రోజా చారిటబుల్ ద్వారా చిత్తూరు అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ రవినాయుడు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించారని, ఇదంతా ఓర్వలేక భాను నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని స్థానిక ప్రజలు మండిపడ్డారు. కోవిడ్ సమయంలో మంత్రి రోజా ప్రజలకు సేవలు అందిస్తే..భాను మాత్రం ఇంటికే పరిమితమయ్యాడని, అలాంటి వ్యక్తి మంత్రి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యత అవసరం


ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

పాలసముద్రం: ఉపాధిహామీ పథకంలో చేస్తున్న పనులు నాణ్యతగా ఉండాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. గంగమాంబపురంలో సోమవారం ఉపాధిహామీ కూలీలకు సమీక్ష సమావేశం నిర్వహించారు. కూలీలతో ఎంపీడీఓ శ్రీనివాసన్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో చేస్తున్న పనులు నాణ్యతగా చేయాలి. రోజువారి కూలీలు సక్రమంగా రావాలంటే తప్పకుండా మేట్ల సహాయంతో ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. కష్టపడి పనులు చేస్తున్న కూలీలు ఆన్‌లైన్‌లో హాజరు వేసుకోవాలని తెలిపారు.


మాట్లాడుతున్న ఎం.చిన్నబ్బ

టీడీపీకి కాలం చెల్లింది

శ్రీరంగరాజపురం: ప్రజాదరణలేని టీడీపీకి కాలం చెల్లిందని ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ఎం.చిన్నబ్బ అన్నారు. ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో రాష్ట్రాభివృద్ధికి కృషి చేసిన దాఖలాలు లేవన్నారు. నేడు దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా తీర్చిదిద్దిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఎవరైనా దళితులుగా పుట్టాలని కోరుకుంటారా అన్న చంద్రబాబుకు దళితుల ఓట్లు అడిగే హక్కు లేదని అన్నారు. దళితులందరూ ఏకతాటిగా ఉంటూ, రాబోయే ఎన్నికల్లో జగనన్నను అఖండ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి జనార్దన్, మండల బీసీ సెల్ అధ్యక్షులు కుమార్, దామునాయుడు, ముత్యాలు, బాలకృష్ణయాదవ్, బాబు, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటు పడదాం

నగరి: పర్యావరణ పరిరక్షణ మన చేతుల్లోనే ఉందని మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఎక్కడ పడితే అక్కడ కాలువల్లో చెత్త వేయరాదని, ప్లాస్టిక్ వస్తువులు కాల్చరాదని విజ్ఞప్తి చేశారు. పర్యావరణాన్ని పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాన్నారు. భావితరాలకు ఆస్తులు, అంతస్తులు ఇవ్వడం కన్నా మంచి వాతావరణం కల్పించడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో డీఈ నరేష్‌బాబు, ఏఈ రమేష్, మేనేజర్ శేఖర్, టీపీఓ నీరజాక్షి, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏ.పురుషోత్తం, మున్సిపల్, వార్డ్ పారిశుద్య పర్యావరణ కార్యదర్శులు, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో..

మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రపంచాన్ని ప్లాస్టిక్ భూతం పట్టి పీడిస్తోందన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణం తీవ్రంగా దెబ్బ తింటోందని, ప్లాస్టిక్ వాడకానికి స్వస్తి పలకాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ గోపాల్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజరత్నమ్మ, హెడ్‌నర్సులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

పర్యావరణ పరిరక్షణపై ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్లోబల్ వార్మింగ్ వలన కలుగుతున్న అనర్థాలను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంపకాన్ని బాధ్యతగా తీసుకొని పర్యావరణాన్ని రక్షించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ధర్మారావు, నరసయ్య, శివలక్ష్మి, ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: ప్రకృతిని పరిరక్షించుకోవల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైక్రో బయాలజీ విద్యార్థిని మోనీషా అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సెమినార్‌లో మోనీషా మాట్లాడారు. విద్యార్థులు పర్యావరణానికి అత్యంత ప్రమాదకరమైన ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వాడకానికి స్వస్తి పలకాలని కోరారు. గుడ్డ సంచులు వినియోగంలోకి తేవాలని కోరారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు సాయి వెంకటేష్, పద్మావతీ, టి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


పుత్తూరు రూరల్ : మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్, సిబ్బంది

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో...

మున్సిపల్ చైర్మన్ ఏ.హరి మాట్లాడుతూ, మానవుని మనుగడ ప్రకృతిపై ఆధారపడి ఉందని, ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తే అది వినాశనం వైపు దారితీస్తుందని హెచ్చరించారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ కాలుష్య నివారణకు మొక్కల పెంచాలని కోరారు. పట్టణంలో అధికారులు, కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ కెఎల్‌ఎస్ రెడ్డి, వైస్ చైర్మన్ శంకర్, కౌన్సిలర్లు ఏకాంబరం, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

చెట్లు పెంచుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

శ్రీరంగరాజపురం: చెట్లను పెంచుదాం పర్యావరణాన్ని కాపాడుదాం అని జిల్లా టీబీ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల పీహెచ్‌సీ ఆవరణలో చెట్లను నాటారు. పురవీధుల్లో ప్లకార్డులతో ర్యాలీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. దీనికి డాక్టర్ పల్లవి, సందీప్ రాజు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

కార్వేటినగరం: పర్యావరణ పరిరక్షణే ప్రధాన ధ్యేయమని అటవీ శాఖాధికారి చంద్రశేఖర్ అన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆర్‌కేఎస్‌ఆర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను పెంచాలన్నారు. కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని చెప్పారు. అడవులను రక్షించుకోవాల్సిన అవసరం అందరి పైనా ఉందని పేర్కొన్నారు. చివరిగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్వేటినగరం సర్పంచ్ ధనంజయ వర్మ, వనపాలకులు రవిరావు, ప్రధానోపాధ్యాయులు మాధవరెడ్డి, రెవెన్యూ, అటవీశాఖ, సచివాలయ సిబ్బంది, గ్రామవలంటీర్లు పాల్గొన్నారు.



నగరి : ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్



నగరి : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్


మొక్క నాటుతున్న డాక్టర్ రవిరాజు


నగరి : మొక్కలు నాటుతున్న మెడికల్ సూపరింటెండెంట్


పుత్తూరు రూరల్ : సెమినార్‌లో మాట్లాడుతున్న మోనీషా


ర్యాలీ ప్రదర్శన చేస్తున్న అధికారులు, సిబ్బంది